క్లుప్తంగా

పోచమ్మకు ఆదివాసీల మొక్కులు

కెరమెరి: మండల కేంద్రంలోని పోచమ్మ తల్లికి చిన్న పాట్నాపూర్ గ్రామానికి చెందిన ఆదివాసీలు మంగళవారం మొక్కులు చెల్లించుకున్నారు. కాలినడకతో బాజాభజంత్రీల నడుమ వారు పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్రం వంశస్తుల పెద్ద దేవుడు కెరమెరి మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో వెలిసిందని అందుకు ప్రతీ సంవత్సరం ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకుంటామని కటోడాలు తెలిపారు. అనంతరం వంటావార్పు చేసి, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని, భేటింగ్ అయ్యారు.

రాష్ట్రస్థాయికి కెరమెరి కబడ్డీ జట్టు



క్రీడాకారులతో ఎంపీడీవో అంజద్‌పాషా

కెరమెరి: సీఎం కప్ ఆటల పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ఎంపికైన కెరమెరి జట్టును ఎంపీడీవో అంజద్‌పాషా అభినందించారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి మండల కబడ్డీ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జనగాంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజయం సాధించాలని ఎంపీడీవో ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం క్రీడాకారులను సత్కరించారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం తదితరులు ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్న పోలీసులు

రెబ్బెన: మండలంలోని జాతీయ రహదారిపై మంగళవారం తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు పశువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో షేక్ షబ్బీర్, షేక్ అఫ్తాబ్‌లు ఆధారాలు లేకుండా మహారాష్ట్రలోని గడ్‌చందూర్ నుంచి హైదరాబాద్‌కు బోలెరో వాహనంలో 7 ఎద్దులు, 3 ఆవులను తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


'బాబా సేవలు చిరస్మరణీయం'

జైనూర్: ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సద్గురు పూలాజీ బాబా అని సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగిళే అన్నారు. మంగళవారం మండలంలోని పట్నాపూర్ సిద్ధేశ్వర ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధ్యానధారణ చేపట్టి ధ్వజానికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ.. ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్‌చైర్మన్ వామన్ ఇంగిళే, గ్రామ పెద్దలు గంగాధర్, దంబిపటేల్, కార్యదర్శి దాదారావు తదితరులు ఉన్నారు.

శివాలయంలో ముగిసిన ఉత్సవాలు

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయం 51వ వార్షికోత్సవ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం ఆలయంలో అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు



కిషన్‌రెడ్డితో బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయ్‌కుమార్ మంగళవారం కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రికి పుష్ప గుచ్ఛం అందజేసి పార్టీ అంశాలపై చర్చించారు. ఆలయ ఫౌండేషన్ సీఈవో రమేశ్‌బాబు, వాలంటీర్ రాజేశ్, నాయకులు ఉన్నారు.

సులభ్ కాంప్లెక్స్‌కు మోక్షమెప్పుడో..?

- రూ. 3లక్షల నిధులు మంజూరు
- అందుబాటులో స్థలం లేక జరగని పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



తిర్యాణి మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తా

తిర్యాణి: అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న మండలంలో నేటికీ సరైన సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం గత మూడేళ్ల క్రితం డీఎంఎఫ్‌టీ ద్వారా నిధులు మంజూరయ్యాయి. దీంతో వాటి నిర్మాణం కోసం అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు కుమురంభీం చౌరస్తా సమీపంలో ఉన్న పశు వైద్యశాలలో భూమిపూజ చేశారు. అయితే అప్పుడు వాటిని నిర్మించేందుకు కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు. దీంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

ఎస్బీఎం కింద రూ.3 లక్షలు మంజూరు..

డీఎంఎఫ్‌టీ నిధులు వెనక్కి వెళ్లడంతో అధికారులు సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించగా.. తాజాగా స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్బీఎం) పథకం కింద రూ. 3 లక్షలు నిధులు మంజూరయ్యాయి. గతంలో భూమిపూజ చేసిన స్థలం ప్రస్తుతం నిర్మించే నిర్మాణం సరిపోకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించడం లేదు. దీంతో మండల కేంద్రానికి వచ్చే ప్రజలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వేరే మార్గం లేక చెట్లు, వాగులు, వంకలు, రోడ్ల పక్కన కానిస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది. కాగా మండల కేంద్రంలో ప్రతీ వారం నిర్వహించే వారసంతతో సమస్య మరింత తీవ్రమవుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో కూరగాయలు విక్రయించడానికి వచ్చిన వ్యాపారులు, కొనేందుకు వచ్చే మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చర్యలు చేపట్టి నిర్మాణ పనుల ను పూర్తి చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

> **దాతలు ముందుకు రావాలి..**
>
> మండల కేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్‌ల నిర్మాణం కోసం ఎస్బీఎం పథకం కింద రూ. 3లక్షల నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ స్థలం ఊరికి దూరంగా ఉండటంతో అక్కడ నిర్మాణం చేపట్టినా నిరుపయోగమవుతుంది. దీంతో పనులు ప్రారంభించడం లేదు. కుమురం భీం చౌరస్తా పరిసర ప్రాంతాల్లో ఎవరైనా భూదాతలు ముందుకు వస్తే వెంటనే నిర్మాణం చేపడుతాం.
>
> – వేముల మల్లేశ్, ఎంపీడీవో

ముస్తాబైన చర్చిలు



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన సెయింట్ జూడ్ చర్చి

పెంచికల్‌పేట్/రెబ్బెన/కౌటాల: క్రిస్మస్ సందర్భంగా పెంచికల్‌పేట్‌లోని సెయింట్ జూడ్ చర్చిని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కౌటాలతో పాటు రెబ్బెన మండలం గోలేటిలోని ఇండియా మిషన్ చర్చి, గోలేటి విలేజ్ బస్టాండ్ వద్ద గల కార్మెల్ డివైన్ సెంటర్, మండల కేంద్రంలోని ఆగాపే షాలోమ్ చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. బుధవారం పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ముస్తాబైన ఇండియా మిషన్ చర్చి

మహిళలు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి



భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో

వాంకిడి: మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని చిచ్చుపల్లి గ్రామానికి చెందిన మహిళకు ఐకేపీ నుంచి వెయ్యి కోళ్ల పెంపకానికి మంజూరైన పౌల్ట్రీ షెడ్ నిర్మాణానికి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పొందుతూ సాధికారత దిశగా నడవాలన్నారు. ఉపాధి హామీ నిధుల నుంచి కోళ్ల ఫారం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ధాబా, సవాలి, నవేధరి, దొడ్డిగూడ జీపీలలో జరుగుతున్న నర్సరీ పనులను పరిశీలించారు. బ్యాగ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇంటి సర్వేను పరిశీలించి తప్పులు దొర్లకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వేకు సంబంధించి కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏపీవో శ్రావణ్ కుమార్, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

పెరియార్ రామస్వామి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: పెరియార్ రామస్వామి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని బీఎస్ఐ (బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా) జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బీఎస్ఐ, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పెరియర్ రామస్వామి 51వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సంఘ సంస్కర్తగా, సామాజిక వేత్తగా పెరియార్ రామస్వామి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. పంచశీల సూత్రాలు ఆలపించి మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జైరాం ఉప్రె, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు విలాస్ ఖోబ్రగడె, రాజేంద్ర ప్రసాద్, రోషన్, ప్రతాప్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

బెజ్జూర్: మండలంలోని అందుగులగూడెం గ్రామానికి చెందిన తొర్రెం వెంకటలక్ష్మి అనే విద్యార్థిని మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. విద్యార్థిని మృతికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెజ్జూర్ ఎస్సైతో పాటు సంబంధిత హాస్టల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి అధికారులు ఇచ్చిన హామీలను త్వరగా నెరవేర్చాలని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ.10 లక్షలు అందించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం తరఫున మంజూరవుతున్న ఇందిరమ్మ పథకంలో విద్యార్థిని కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఉమ్మెరా బాలకృష్ణ, అల్లూరి మోహన్, కొప్పుల శంకర్, సామల తిరుపతి, దిలీప్, బిక్షపతి, రాజారాం తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె



భిక్షాటన చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సమగ్ర శిక్షా ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరుకుంది. భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, జీవితబీమా 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం, పదవీ విరమణ బెనిఫిట్స్, 12 నెలల వేతన స్కేల్‌లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ, యూఆర్ఎస్ సమగ్ర శిక్షా సిబ్బంది తుకారాం, మోహన్, నగేశ్, సంతోష్, రాజేశ్, ప్రశాంత్, మల్లేశ్, రమాదేవి, ధర్మయ్య పాల్గొన్నారు.

ఆవు యజమానికి నష్టపరిహారం



నష్టపరిహారం అందజేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: చిరుత దాడిలో మృతి చెందిన ఆవుకు సంబంధించి అటవీశాఖ అధికారులు యజమానికి నష్టపరిహారం అందజేశారు. ఆసిఫాబాద్ రేంజ్ అధికారి గోవింద్ చంద్ సర్దార్ మాట్లాడుతూ మాణిక్‌గూడ వద్ద గల అర్బన్ పార్క్ సమీపంలో సోమవారం గ్రామానికి చెందిన అప్పన్నకు చెందిన ఆవు చిరుత దాడిలో మృతి చెందగా మంగళవారం రూ. 25వేల నష్టపరిహారం అందజేశారు. డిప్యూటీ రేంజ్ అధికారి యోగేశ్, బీట్ అధికారులు రాజేశ్, రామ్మూర్తి పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల సమస్యలపై జనవరి 8న చలో హైదరాబాద్ సమర శంఖారావ సభను విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లహుకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో చలో హైదరాబాద్ శంఖారావ సభ పోస్టర్ ఆవిష్కరించారు.నాయకులు అంజన్న, రాకేశ్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై అవగాహన

- అధికారుల ప్రత్యేక కార్యాచరణ
- అటవీ సమీప గ్రామాల్లో పర్యటన
- 24 వేల హెక్టార్లలో అడవులు



నాగల్‌గొందిలో అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

కెరమెరి: అడవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా, విలువైన వృక్షసంపదకు నష్టం వాటిల్లకుండా అటవీ అధికారులు ఫైర్‌లైన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అడవిలో వేసవికాలంలో చెట్ల ఆకులు రాలడంతో ఏ చివరన నిప్పు అంటుకున్నా అడవి మొత్తం దావానంలా అంటుకుంటుంది. అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా అటవీ సమీపగ్రామాలు, రహదారులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో 25 బీట్లు, 10 సెక్షన్‌లు ఉన్నాయి. మొత్తంగా 27,289 హెక్టార్లలో అడవులు వ్యాపించి ఉన్నాయి. ఇప్పటి వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

మానవతప్పిదాలతోనే..

అగ్ని ప్రమాదాలు సహజసిద్ధంగా, మరికొన్ని సమయాల్లో మానవ తప్పిదాలతో జరుగుతుంటాయి. పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లిన సమయంలో బీడీలు తాగి నిర్లక్ష్యంగా పడేస్తుండడం, వ్యవసాయ భూముల్లో వ్యర్థాలను కాల్చడం తదితర కారణాలతో మంటలు అంటుకుంటున్నాయి. ఇలా జరగకుండా ఉండేందుకు అటవీ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీడీలు, అగ్గిపెట్టెలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లొద్దని సూచిస్తున్నారు.

ఫైర్‌లైన్ నిర్మాణం ఇలా..

- అగ్ని ప్రమాదాలు జరకుండా అధికారులు ఎండాకాలం ప్రారంభం నుంచే ఫైర్‌లైన్ నిర్మాణం చేపడతారు.
- జిల్లాలో గతేడాది సుమారు 100 కిలో మీటర్ల మేర నిర్మించారు.
- ఫైర్‌లైన్ అంటే రాలిన చెట్ల ఆకులను బాటల్లో పరిచి నిప్పు పెట్టి కాల్చుతారు. ఇలా చేయడం వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైర్‌లైన్స్ ఉన్నంత వరకు మంటలు వచ్చి ఆగిపోతాయి. అయినా మంటలు వ్యాప్తి చెందితే ఫైర్ బ్లోయర్ల సాయంతో ఆర్పేందుకు సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

> **అడవుల రక్షణ మన బాధ్యత**
>
> 
>
> అడవుల రక్షణ మనందరి బాధ్యత. వన్య ప్రాణులతో పాటు అడవులకు కూడా రక్షణ కల్పించాలి. ఎవరూ కూడా వృక్షాలకు నిప్పుపెట్టకూడదు. అడవుల సంరక్షణపై సమీప గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.
>
> – సయ్యద్ మజారొద్దీన్, ఎఫ్ఆర్‌వో, కెరమెరి

జోడేఘాట్‌ను సందర్శించిన మధ్యప్రదేశ్ ఆదివాసీలు



సమాధికి పూజలు చేస్తున్న ఆదివాసీలు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్ గ్రామాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆదివాసీలు మంగళవారం సందర్శించారు. గ్రామంలో ఉన్న కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాధిపై పూలు చల్లారు. అనంతరం మ్యూజియంను సందర్శించారు. కుమురం భీం తన సహచరులతో మాట్లాడుతున్న ప్రతిమలను, గుస్సాడీలను, ఆదివాసీల ఆభరణాలు, పనిముట్లను తిలకించారు. ఆదివాసీల దేవతలను పూజించారు. భీం మనమడు కుమురం సోనేరావు, గ్రామ పటేల్ పెందోర్ రాజేశ్వర్, క్యూరేటర్ దుందేరావు, తదితరులు ఉన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలకు పది నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఏఎన్ఎంలకు నెలల తరబడి వేతనాలు అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, నాయకులు శ్రీదేవి, హీరాబాయి, చాందిని, మారుబాయి, సుజాత, పోసుబాయి, సువార్త, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు



సర్వే వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సకాలంలో సర్వే పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. వంటగది, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గర్భిణులు వివరాలు నమోదు చేసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు అందించాలన్నారు. పౌష్టికాహారంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. టీచర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం మోడిలోని కేజీబీవీలో భోజనం, విద్యాబోధన గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంపీడీవో అంజద్‌పాషా, ఎంఈవో ఆడే ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఆవిర్భావ వేడుకల్లో మొండిచేయి'



మాట్లాడుతున్న ఓదెలు

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంపుపై ప్రకటన చేస్తారని ఆశపడిన వారికి యాజమాన్యం మొండిచేయి చూపిందని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని సివిల్ డిపార్టుమెంట్ కార్యాలయం వద్ద మంగళవారం కాంట్రాక్టు కార్మికుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కనీస వేతనాల జీవో రాకపోవడం, వేతనాలు పెరగకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నెల రోజుల్లో సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాల పెంచుతామని ప్రకటించి ప్రకటలకే పరిమితమయ్యారని ఆరోపించారు. 2022 సెప్టెంబర్‌లో సమ్మె సందర్భంగా చేసిన ఒప్పందాలు అమలు చేయాలని, బెల్ట్ క్లీనింగ్, బ్లాస్టింగ్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, నర్సరీ కార్మికులను కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి కనీస వేతనం, సీఎంపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఈ నెల 27న గోలేటి జీఎం కార్యాలయం ముట్టడికి కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

దహెగాం: మండల కేంద్రంలో మంగళవారం బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశారు. 45 మందికి శుక్లాన్ని గుర్తించి వారికి మెరుగైన కంటి పరీక్షలు నిర్వహిస్తామని వైద్యుడు తెలిపారు. అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, గ్రామస్తులు మెరుగు సిద్దుగౌడ్, సంతోష్‌గౌడ్, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.